క్లుప్తంగా

ఆకస్మిక తనిఖీ



ద్రాక్షారామ పీహెచ్‌సీలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న వెంకటేశ్వరరావు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ పీహెచ్‌సీని జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రం ల్యాబ్‌లో జరుగుతున్న పరీక్షల వివరాల రికార్డులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. డెంగీ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డివిజనల్ మెడికల్ ఆఫీసర్ ఎస్.ప్రశాంతి, సబ్ యూనిట్ ఆఫీసర్ సత్యనారాయణ సీహెచ్‌ఓ యు.వీరవేణి, ఎంపీహెచ్‌ఎస్ నార్ని గంగాధర్, పీహెచ్ఎన్ జానకమ్మ, హెచ్‌వీ వరలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్ మాణిక్యాంబ, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

గొర్రెల రాముకు సత్కారం



గొర్రెల రామును సత్కరిస్తున్న జీవీ రావు

రామచంద్రపురం: రాష్ట్ర ప్రభుత్వం సృజనాత్మకత, సాంస్కృతిక సమితి, భాషా సంస్కృతి శాఖ ఆధ్వర్యంలో ఉగాది సందర్భంగా పట్టణానికి చెందిన బుర్రకథ కళాకారుడు గొర్రెల రాముకి కళారత్న (హంస) పురస్కారం -2025ను ప్రభుత్వం అందజేసింది. మోడరన్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన అభినందన సభలో అధినేత జీవీ రావు దుశ్శాలువా, మెమెంటోను అందజేసి అభినందించారు.

సమస్యలు పరిష్కారమయ్యే వరకూ టిడ్కోలోనే పురపాలన

మండపేట: టిడ్కో గృహాల్లో పెండింగ్ పనులు పూర్తి చేయకుండా అధికారులు నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్లాట్లలోని అన్ని పూర్తయ్యేంత వరకూ టిడ్కో గృహాల నుంచే పురపాలన సాగించాలని ఆయన కమిషనర్ టీవీ రంగారావును ఆదేశించారు. మంగళవారం టిడ్కో, ట్రాన్స్‌కో, మున్సిపల్ అధికారులతో ఆయన కాలనీలోనే సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టిడ్కో ఇళ్ల పనుల పురోగతిపై ఆరా తీశారు. ప్లాట్లు ఇంకా ఎంతమందికి ఇవ్వాలని అడిగారు. ఏమైనా బ్యాంకు ఇబ్బందులు ఉన్నాయా అని ప్రశ్నించారు. బ్లాకుల వారీగా సమస్యలు పరిష్కరించేందుకు ప్రతీ బ్లాకు వద్ద సంబంధిత అధికారి ఫోన్ నంబరుతో ఫ్లెక్సీ పెట్టాలన్నారు. తాగునీటి కుళాయిల ఏర్పాటుతో సహా అన్ని పూర్తయ్యేంత వరకూ పురపాలన ఇక్కడి నుంచే జరపాలని ఆయన కమిషనర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో టిడ్కో ఏఈ వివేక్, మున్సిపల్ ఏఈలు పవన్‌కుమార్, బీ ఆంజనేయులు, మేనేజర్, మెప్మా సీఎంఎం పెండ్యాల సుజాత తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా కూటమి ప్రభుత్వం

మండపేట: పేద బడుగు బలహీన వర్గాలకు కూటమి ప్రభుత్వం అండగా వుంటుందని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మంగళవారం సచివాలయ ఉద్యోగులు, మున్సిపల్ అధికారులు చేపట్టిన ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్ల బట్వాడాను ఆయన పరిశీలించారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లును టీడీపీ వ్యతిరేకించాలి

మామిడికుదురు: ఈ నెల 3న పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న వక్ఫ్ సవరణ బిల్లును టీడీపీ వ్యతిరేకించాలని రాష్ట్ర షియా ఉలేమా బోర్డు అధ్యక్షుడు మౌలానా అబ్బాస్ బాఖరి కోరారు. నగరం గ్రామంలో మంగళవారం ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబు ఈ బిల్లును వ్యతిరేకించాలని ఆయన కోరారు. ఈ బిల్లులో ప్రతిపాదించిన సవరణల ప్రకారం వక్ఫ్ సంస్థలపై ప్రభుత్వ నియంత్రణ పెంచాలని ప్రతిపాదించారన్నారు. ఇది మతపరమైన సూత్రాలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఈ బిల్లులో వక్ఫ్ ట్రిబ్యునల్ తీర్పులకు వ్యతిరేకంగా హైకోర్టులో ఆప్పీల్ చేసే నిబంధన ఉందని, ఇది వక్ఫ్ ట్రిబ్యునల్ అధికారాలను పరిమితం చేస్తుందని, న్యాయం పొందే మార్గాన్ని కష్టతరం చేస్తుందని అబ్బాస్ బాఖరి పేర్కొన్నారు. ఈ అంశాల ఆధారంగా రాష్ట్ర షియా ఉలేమా బోర్డు ఈ బిల్లును పూర్తిగా వ్యతిరేకిస్తూ టీడీపీని బిల్లును వ్యతిరేకించాలని కోరిందన్నారు.

ఘనంగా కనకదుర్గమ్మ సంబరం

మామిడికుదురు: గోగన్నమఠం గ్రామ పరిధిలోని తోట మెరకలో కనకదుర్గమ్మ సంబరం మంగళవారం ఘనంగా నిర్వహించారు. గరగ నృత్యాలు, చిత్ర, విచిత్ర వేషధారణలు, శక్తి వేషాలు, భక్తుల కోలాహలం, బాణసంచా కాల్పుల నడుమ సంబరం ఆద్యంతం కన్నుల పండువలా జరిపించారు. గ్రామంలో భారీ ఊరేగింపు జరిగింది. భారీ సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ముడుపులు, మొక్కులు చెల్లించారు.

ఓఆర్‌ఎస్.. ఆరోగ్యానికి ప్లస్

- పెరుగుతున్న ఎండలు
- ఓఆర్‌ఎస్ తగిన మోతాదులో తాగడం తప్పనిసరి
- ఇంట్లో తయారీ ఇంకా మంచిది
- జూన్ వరకూ ఎండలు మరింత తీవ్రం



ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు

కపిలేశ్వరపురం: రోజురోజుకూ ఎండలు మండుతున్నాయి. ఏప్రిల్ నుంచి జూన్ వరకూ తీవ్రంగా ఉంటాయి. ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని ప్రభుత్వ విభాగాలు హెచ్చరిస్తున్నాయి. సాధారణం కంటే అధిక స్థాయిలో ఉష్ణోగ్రతలు, వడగాలులు ఎక్కువగా ఉండే అవకాశాలున్నట్టు భారత వాతావరణ విభాగం (ఐఎండీ) మార్చి 31న స్పష్టం చేసింది. సాధారణంగా ఏప్రిల్ నుంచి జూన్ మధ్యలో వారం రోజుల పాటు వడగాడ్పులు వీస్తాయి. ఈ ఏడాది అదనంగా మరో ఏడు రోజులు పాటు తీవ్రత పెరగనున్నట్టు ప్రకటించారు. ఇప్పటికే ఉక్కపోత పెరిగింది. శ్రామిక, ఉద్యోగ, వ్యాపారులు విధి నిర్వహణలో భాగంగా అనివార్య పరిస్థితుల్లో మండే ఎండల్లో తిరగక తప్పదు.

పనులకు వెళ్లే వారు..

మండపేట మండలం ద్వారపూడి, ఏడిద, జెడ్.మేడపాడు, కపిలేశ్వరపురం మండలం అంగర, పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం తదితర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో రైసుమిల్లుల్లో పని చేస్తుంటారు. పౌల్ట్రీ ఫారాల్లో శ్రామికులు అనేక మంది ఎండలబారిన పడుతుంటారు. రామచంద్రపురం, మండపేట పట్టణాల్లో చిరు వ్యాపారులు ద్విచక్రవాహనాలపై పండ్లు, కూరగాయలు విక్రయిస్తుంటారు. కపిలేశ్వరపురం, తాతపూడి గ్రామాల్లోని ర్యాంపులలో ఇసుకను లోడింగ్ చేస్తుంటారు. వారితో పాటు ప్రయాణికులు ఎండ ప్రభావాలకు లోనుకాకుండా తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలి.

వడదెబ్బ తగిలే అవకాశం

శరీరంలో సహజంగా నీటిశాతం తగ్గిపోవడంతో వడదెబ్బకు గురవుతుంటారు. ఇలాంటి ప్రమాదానికి గురికాకుండా ఉండేందుకు ఓఆర్‌ఎస్ ద్రావణం ఉపకరిస్తుందని వైద్యులు చెబుతున్నారు. ఓఆర్‌ఎస్ ద్రావణం ప్రాధాన్యతపై కపిలేశ్వరపురం మండలం అంగర పీహెచ్‌సీ వైద్యాధికారిణి పి.రత్న కుమారి ఇలా వివరించారు. స్థల, కాలాలను బట్టి శరీరాన్ని నిర్దేశించిన ఉష్ణోగ్రతలో ఉంచుకోవాలి. మెదడులో హైపో తలామస్ అనే భాగం శరీరంలోని వేడిని క్రమబద్ధీకరిస్తుంది. తగిన నీటిని తాగకపోయినా, ఎండలో ఎక్కువ తిరిగినా హైపో తలామస్ భాగమే అధిక ఉష్ణోగ్రతకు లోనై క్రమబద్ధీకరించే పనిని చేయలేదు. ఈ స్థితిలో తల తిరగడం, నీరసం, నిస్సారణ, తలనొప్పి, జ్వరం, చీకటి కమ్మినట్టు అనిపించడం, వాంతి అవుతున్న భావన కలగడం వంటి లక్షణాలు వడదెబ్బకు గురైనట్టు నిర్ధారణ చేస్తాయి.



పి.రత్నకుమారి

ఓఆర్‌ఎస్ తయారీ ఇలా

ఓఆర్‌ఎస్ అనేది వివిధ లవణాల మిశ్రమంతో కూడిన 20.5 గ్రాముల పౌడర్ ప్యాకెట్. దీనిలో 2.6 గ్రాముల సోడియం క్లోరైడ్, 1.5 గ్రాముల పోటాషియం క్లోరైడ్, 2.9 గ్రాముల సోడియం సిట్రేట్, 13.5 గ్రాముల డెక్స్‌ట్రోజ్ ఉంటాయి. ఈ పౌడర్ ప్యాకెట్‌ను సురక్షితమైన లీటరు నీటిలో కలిపి రోజు మొత్తంలో వయస్సును బట్టి తగిన మోతాదులో తాగాలి. మితిమీరిన మోతాదులో తాగడమూ అనర్థాలు తెచ్చి పెడుతుంది. ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్య, ఆరోగ్య కార్యకర్తలు వద్ద ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయి. సమయానికి ఓఆర్‌ఎస్ ప్యాకెట్ అందుబాటులో లేకపోతే ఇంటిలోనే ఉప్పు, పంచదార, నీరు సాయంతో ఈ ద్రావణాన్ని తయారు చేసుకోవచ్చు. లీటరు నీటిలో చిటికెడు ఉప్పు, చారెడు (అరస్పూన్) పంచదారలను కలిపి సేవించవచ్చు. రెండేళ్ల లోపు వారు 50 నుంచి 100 ఎం.ఎల్.ను ఆరారగా అర స్పూన్ చొప్పున ప్రతి పది నిమిషాలకు ఒకసారి తాగాలి. రెండు నుంచి పదేళ్ల వారు 100-200 ఎం.ఎల్.(ఒక గ్లాస్) వరకూ ఒక స్పూన్ చొప్పున తాగాలి. పదేళ్ల పైబడిన వారు 50 ఎం.ఎల్. (చిన్న గ్లాస్) చొప్పున ఎండలో సంచరిస్తున్న స్థితిగతులను బట్టి తాగుతూ ఉండాలి. ఎండ తీవ్రతకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని వైద్యాధికారి పి.రత్నకుమారి సూచించారు.

గొల్లపుంతలో పుంతరోడ్డు అభివృద్ధి చేయాలి

మండపేట: గొల్లపుంత రోడ్డులోని పుంతరోడ్డు అభివృద్ధి పరచాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుకు స్థానిక రైతులు విన్నవించారు. గొల్లపుంతలో ఉన్న వద్దా వారి తోట పుంతగట్టును పటిష్టం చేయాలని కోరారు. మంగళవారం రైతులందరూ ఆయనను కలిసి సమస్యలను విన్నవించుకున్నారు. గొల్లపుంతలో సుమారు 70 ఎకరాల ఆయకట్టు ఉందన్నారు. పంట పనులన్నీ ఈ పుంత గట్టు వెంబడి తీసుకురావాలని, మరోపక్క పంట బోదె మధ్యలో గట్టు ఉందని, ఆ గట్టు సాగునీరు కోసం శుభ్రం చేయడం వల్ల బలహీన పడిపోయిందన్నారు. ఈ గట్టును మరింత మరింత పటిష్టం చేయాలని కోరారు. పుంత రోడ్డు ట్రాక్టర్ తిరిగే అవకాశం లేదని, బీడుల్లో గడ్డిని కోసుకుని ద్విచక్ర వాహనాల ద్వారా పశువుల పాకలకు తరలించడానికి కూడా గట్టు సరిగా లేక ఇబ్బంది పడుతున్నామనితెలిపారు. దీనివల్ల పంటలో అదనపు ఖర్చు పెరుగుతోందని తెలిపారు. పుంత రోడ్డు వరకూ గ్రావెల్‌తో అభివృద్ధి చేసి సమస్య పరిష్కరించాలని రైతులు కోరారు.

87 శాతం ఇంటి పన్ను వసూలు

రాయవరం: మండలంలోని 12 గ్రామ పంచాయతీల పరిధిలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి 87 శాతం ఇంటి పన్నులు వసూలైనట్టు పంచాయతీ విస్తరణాధికారి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులకు తెలిపారు. ఇంటి పన్నుల రూపేణా రూ.2,30,99,042 వసూలు లక్ష్యం కాగా, మార్చి నెలాఖరు వరకు రూ.2,00,56,067 వసూలైనట్లు ఆయన తెలిపారు. మండలంలోని కురకాళ్లపల్లి, కూర్మాపురం, నదురుబాద, పసలపూడి, సోమేశ్వరం, వి.సావరం, వెదురుపాక, వెంటూరు గ్రామాల్లో శత శాతం పన్ను వసూలు జరిగినట్టు తెలిపారు. లొల్ల, మాచవరం పంచాయతీల్లో 50 శాతం చెల్లూరు పంచాయతీలో 81 శాతం, రాయవరం పంచాయతీలో 95 శాతం వసూలు జరిగాయన్నారు.

ప్రతి మహిళా పారిశ్రామికవేత్తగా ఎదగాలి



కాజులూరులో కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్

కాజులూరు: ప్రతి మహిళా ఒక పారిశ్రామికవేత్తగా ఎదిగి తమ కుటుంబ, రాష్ట్ర అభివృద్ధికి పాటుపడాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మంగళవారం కాజులూరులో మహిళా స్వయం ఉపాధి పథకంలో భాగంగా మహిళలకు కుట్టుమెషీన్ల శిక్షణను మంత్రి సుభాష్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా ప్రభుత్వం ఉచిత కుట్టుమెషీన్ల కార్యక్రమం చేపట్టిందన్నారు. మండల గ్రామాల్లో 240 మంది ఈ శిక్షణకు ఎంపికయ్యారని మూడు నెలల శిక్షణ అనంతరం వీరికి ఉచితంగా కుట్టుమెషీన్లు అందజేస్తామన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఎనిమిది మంది వితంతు మహిళలకు నూతన పింఛన్లు అందజేసి పలువురు దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, వినికిడి యంత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ దూడల చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ యాళ్ల కృష్ణారావు, డేగల సతీష్, పెనుమళ్ల, ఆర్యావటం మాజీ సర్పంచ్‌లు వనుం వీరబ్రహ్మం, కోట తాతబ్బాయి, పెంకే అప్పారావు, రొక్కాల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో మలేరియా పరీక్షలు



అంగర పీహెచ్‌సీలో రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎంఓ వెంకటేశ్వరరావు

కపిలేశ్వరపురం: జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లోని లేబరేటరీల్లో మలేరియా రక్త పరీక్షలు అందుబాటులో ఉన్నాయని ఇన్‌చార్జి జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు అన్నారు. వైద్య, ఆరోగ్య సిబ్బంది ఎప్పటికప్పుడు మలేరియా వ్యాధి నియంత్రణపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారన్నారు. అంగర పీహెచ్‌సీని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. మండపేట సబ్‌యూనిట్ అధికారి సత్యనారాయణతో కలిసి ఆసుపత్రిలోని రికార్డులను తనిఖీ చేశారు. మలేరియా టెస్టులను చేసే తీరు వ్యాధిగ్రస్తుల వివరాలను వైద్యాధికారి పి.రత్నకుమారి, ల్యాబ్ టెక్నీషియన్ ఆలీ వివరించారు. ఆసుపత్రి నిర్వహణకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట హెల్త్ అసిస్టెంట్ బి.రామారావు, వైద్య, ఆరోగ్య సిబ్బంది వెన్నేటి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



గొల్లపాలెం పీహెచ్‌సీలో ఫైలేరియా కిట్లను పంపిణీ చేస్తున్న వైద్యసిబ్బంది

కాజులూరు: వ్యాధుల పట్ల ప్రజలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని గొల్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.సౌజన్య అన్నారు. గొల్లపాలెం పీహెచ్‌సీలో మంగళవారం కరప సబ్ యూనిట్ ఆఫీసర్ నాగబాబు ఆధ్వర్యంలో ఫైలేరియా వ్యాధి నిర్మూలనపై స్థానికులకు వైద్యసిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించి రోగులకు ఫైలేరియా కిట్లను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఫైలేరియా వ్యాధి సోకేందుకు ఏర్పడే అవకాశాలు, నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. పరిశరాల శుభ్రత, ఆహార నియమాలతో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈఓ వైకుంఠరావు, హెచ్‌ఎస్ సామియేలు, సిబ్బంది నరాల రాజారావు, ఏఎన్‌ఎంలు, ఆశా వలంటీర్లు పాల్గొన్నారు.

సీఈఓ సేవలు అభినందనీయం



సొసైటీ సీఈఓ సత్యనారాయణ దంపతులను సత్కరిస్తున్న అధికారులు, సిబ్బంది

కె.గంగవరం: మండలంలోని అముజూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సీఈఓ పాలకొల్లు సత్యనారాయణ ఉద్యోగ విరమణ సభ సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి వి.జవహర్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథులు కూళ్ల నీటి సంఘం అధ్యక్షుడు ఎనుముల గోపాలకృష్ణ, సర్పంచ్ నానావరపు కళ్యాణి, జిల్లా సహకార బ్యాంకు నోడల్ ఆఫీసర్ ఎ.హనుమంతరావు, సూపర్‌వైజర్ సీహెచ్ గోవిందరావు, సహకార సంఘ ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర కోశాధికారి పెంకే సత్యనారాయణ, యూనియన్ బ్రాంచ్ ప్రతినిధి పోలిశెట్టి ఈశ్వరుడు మాట్లాడుతూ సహకార సంఘాల్లో 1987 నుంచి వివిధ హోదాల్లో పనిచేస్తూ అముజూరు సొసైటీ ముఖ్య కార్యనిర్వాహణాధికారిగా అందించిన సేవలు ఎనలేనివని కొనియాడారు. సత్యనారాయణ, వెంకటలక్ష్మి దంపతులను దుశ్శాలువాలు, పూలదండలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాసరావు(చిన్ని), దామినేని శ్రీనివాసు, చిట్టూరి సుబ్బారావు, నియోజకవర్గ వ్యాప్తంగా పలు సొసైటీల సిబ్బంది పాల్గొన్నారు. కుందూరు పీహెచ్‌సీలో సీహెచ్‌ఓ ఎం.లక్ష్మి మంగళవారం ఉద్యోగ విరమణ చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రత్నసుధ లక్ష్మి సేవలను కొనియాడారు. లక్ష్మిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సిబ్బంది సీహెచ్ సూర్యారావు, డీఎస్ మూర్తి, టీఎస్ఆర్ మూర్తి, రాముడు, పార్వతి, సుబ్రహ్మణ్యం, విజయగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అంధులు, వృద్ధులకు భోజనం అందజేత

కొత్తపేట: మండలంలోని వాడపాలెం గ్రామానికి చెందిన సాధనాల శివాజీ మంగళవారం అంధులకు, వృద్ధులకు అల్పాహారం, భోజనం సరఫరా కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్ పుట్టినరోజు పురస్కరించుకుని ఆయన పేరున తన సోదరుల సహకారంతో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్టు జనార్దన్ అభిమాని శివాజీ తెలిపారు.

ఇళ్ల మధ్యలో మద్యం దుకాణం పెడితే ఊరుకోం

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- దీక్షలు చేస్తున్న మహిళలకు మద్దతు



మహిళలకు భరోసా కల్పిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: ప్రజల ఇష్టాఇష్టాలను కాదని జనివాసాల మధ్యలో మద్యం దుకాణం పెడితే ఊరుకోమని, ఒక వేళ పెడితే మద్యం షాపు ముందు టెంట్ వేసి కూర్చుంటామని వైఎస్సార్ సీపీ మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు స్పష్టం చేశారు. పట్టణ పరిధిలోని 28, 29 వార్డులకు సంబంధించిన ప్రాంతమైన సప్తగిరి థియేటర్ ఎదురుగా కల్లుగీత కార్మికులు కోటా వచ్చిన మరో మద్యం షాపును ఏర్పాటు చేసేందుకు సన్నాహక చర్యలు జరుగుతున్న నేపథ్యంలో ఆ రెండు వార్డుల ప్రజలతో పాటుగా 30వ వార్డు ప్రజలు కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఆందోళన బాట పట్టారు. ఈ ఆందోళన 12వ రోజుకు చేరుకుంది. ఈ సమస్యను ఈ మూడు వార్డుల కౌన్సిలర్లు మొండి భవాని, పిల్లి శ్రీనివాస్, మారిశెట్టి సత్యనారాయణ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై ఆయన తక్షణం స్పందిస్తూ ఆ పార్టీ నాయకులతో కలిసి దీక్షా శిబిరాన్ని సందర్శించారు. దీక్షలు చేస్తున్న మహిళలను పలకరించి తన సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చుట్టూ ఇళ్లు, పాఠశాలలు ఉన్న ప్రదేశంలో మద్యం దుకాణం పెడితే అందరూ ఇబ్బంది పడతారని, ఇక్కడ పెట్టనిచ్చేంది లేదని చెప్పారు. దీనిపై ప్రభుత్వం స్పందించాలని, అధికార పార్టీ నాయకులకు మద్యం షాపుల్లో వాటాలుంటే వారెలా పట్టించుకుంటారని ఎద్దేవా చేశారు. ఈ రోడ్డు బైపాస్ రోడ్డును కలిపేందుకు ప్రధానమైన రహదారి అని, నిత్యం వాహనాలు, జనం రద్దీతో నిండి ఉండే ఈ రోడ్డులో మద్యం షాపునకు అనమతులు ఇవ్వడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోసపూరిత హామీలతో ఎన్నికల్లో పబ్బం గడుపుకొని గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం దోపిడీ పాలన సాగిస్తోందంటూ ఆయన ధ్వజ మెత్తారు. మొన్న జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఈ షాపుతో పాటు మరో రెండు షాపులు తొలగించాలని కౌన్సిల్‌లో తీర్మానం చేయమని చెప్పామని, తీర్మానం లేఖను కలెక్టరుకు, ఎక్సైజ్ కమిషనర్, ఎక్సైజ్ శాఖ మంత్రికి తానే స్వయంగా ఇచ్చినట్టు తెలిపారు. ప్రభుత్వ వెంటనే స్పందించి దుకాణాలను ఊరికి దూరంగా పెట్టాలని ఆయన అన్నారు. పార్టీ నాయకులు మొండి మురళి, రెడ్డి రత్తయ్య, షేక్ అలీఖాన్‌బాబా, యరమాటి వెంకన్నబాబు, తణుకు అశోక్, పాలమాల సత్తిబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిల్లా వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డుపై దృష్టి సారించాలి

- బైపాస్ జంక్షన్‌ల వద్ద స్పీడ్ బ్రేకర్లు వేయించాలి
- ప్రయాణికుల డిమాండ్

మండపేట: తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు మండపేట బైపాస్ రోడ్డుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. బైపాస్‌రోడ్డులో ప్రమాదాలు పరిపాటిగా మారిన నేపథ్యంలో జంక్షన్ల వద్ద తప్పని సరిగా స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులు, ఔట్‌పోస్టు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రయాణికులు కోరుతున్నారు. గుమ్మిలేరు రోడ్డు గొడ్డు కాలువ వంతెన నుంచి రామచంద్రపురం కెనాల్ రోడ్డు వరకూ సుమారు 5 కిలోమీటర్లకు పైగా బైపాస్ విస్తరించి ఉంది. ఆయిల్ ఫ్యాక్టరీలు, రైస్‌మిల్లులతో పాటు, మెకానిక్‌షెడ్లు, హోటల్స్, దాబాలు, లారీ యూనియన్ కార్యాలయాలు, ఎడాపెడా వివిధ వ్యాపార సంస్థలతో బైపాస్ నిండి ఉంది. అలాగే ఓ ప్రైవేటు పాఠశాల కూడా ఉంది. ఏడిద దుళ్ల వయా కడియం, రావులపాలెం హైవేకు చేరుకోవాలన్నా బైపాస్ జంక్షన్ దాటుకుని వెళ్లాలి. మరీ ముఖ్యంగా మున్సిపల్ పరిధిలోని 30 వ వార్డు అంతా కూడా బైపాస్ అవతల ఉంది. 30వ వార్డు సంగం కాలనీకి, రాజీవ్ గృహకల్ప కాలనీకి వెళ్లాలంటే బైపాస్ దాటుకుని వెళ్లాల్సిందే. ఈ రెండు కాలనీల్లో సుమారు 5 వేల మంది ప్రజలు నివసిస్తున్నారు. వీరంతా కూడా జంక్షన్ వద్దకు వచ్చే సరికి భయాందోళన చెందుతున్నారు. ఆలమూరు రోడ్డు నుంచి వేగంగా వచ్చే వాహనాలు, ఇటు రామచంద్రపురం నుంచి రావులపాలెం వెళ్లే వాహనాలు కూడా ఈ బైపాస్ రోడ్డు వెంట వెళ్తాయి. ఈ నేపథ్యంలో ఎప్పుడే ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు, ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు కాలనీల్లో ప్రజలు తెల్లారితే పనుల కోసం పట్టణంలోకి రావాలి. విద్యార్థులు కూడా పాఠశాలలకు వెళ్లాలంటే బైపాస్ దాటుకుని పట్టణంలోని స్కూళ్లకు వెళ్లాలి. ఈ క్రమంలో విద్యార్థులు పాఠశాలల నుంచి రోడ్డు దాటుకుని ఇంటికి చేరుకునే వరకూ తల్లి దండ్రులు ప్రాణాలరిచేతిలో పెట్టుకుని ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. బైపాస్ గుండా ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేకపోవడం కారణంగా రెండ్రోజుల క్రితం జరిగిన వేగంగా ఢీ కొట్టిన కారు ప్రమాదంలో ఐదుగురికి గాయాలై ఆసుపత్రి పాలయ్యారు. ఈ విషయాలను పరిగణలోకి తీసుకుని బైపాస్ రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు, లైటింగ్, సూచిక బోర్డులు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కార్పొరేషన్ రుణ లబ్ధిదారులకు రేపు ఇంటర్వ్యూలు

అంబాజీపేట: వివిధ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఈ నెల 3న అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.స రోవర్ తెలిపారు. మండలంలో వివిధ కార్పొరేషన్లకు సంబంధించి 1,397 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. 3న ఇండియన్ బ్యాంక్ నేదునూరు పరిధిలో పసుపల్లి, ఎస్‌బీఐ ముక్కామల పరిధిలో ముక్కామల, 10 గంటలకు యూనియన్ బ్యాంక్ పుల్లేటికుర్రు, 12 గంటలకు యూనియన్ బ్యాంక్ పరిధిలో గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం, మొసలపల్లి, మధ్యాహ్నం ఒంటి గంటకు ఎస్‌బీఐ అంబాజీపేట బ్యాంకు పరిధిలో చిరతపూడి, ఇసుకపూడి, కె.పెదపూడి, 2.30 గంటలకు వాకలగరువు, తొండవరం, నందంపూడి, 3 గంటలకు మాచవరం గ్రామాల లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. కార్పొరేషన్ రుణాల మంజూరు చేసుకున్న లబ్ధిదారులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

శ్మశాన స్థలంలో రోడ్డు నిర్మాణంపై నిరసన



మామిడికుదురులో ధర్నా చేస్తున్న గెద్దాడ గ్రామస్తులు

మామిడికుదురు: గెద్దాడ గ్రామంలో వందేళ్ల నుంచి అన్ని కులాల వారు అంత్యక్రియలు నిర్వహిస్తున్న శ్మశాన స్థలంలో జాతీయ రహదారి నిర్మాణ పనుల నిర్వహణపై గ్రామస్తులు మంగళవారం నిరసన తెలిపారు. మామిడికుదురు మండల రెవెన్యూ కార్యాలయం వద్ద జాతీయ రహదారుల విభాగం అధికారుల తీరును నిరసిస్తూ ధర్నా చేశారు. వినియోగంలో ఉన్న శ్మశానానికి ప్రత్యామ్నాయ స్థలం చూపకుండా రోడ్డు నిర్మాణం ఎలా చేస్తారంటూ ఆందోళన తెలిపారు. శ్మశాన స్థలంలో రోడ్డు నిర్మాణం చేపట్టరాదంటూ పంచాయతీ చేసిన తీర్మానానికి విలువ లేదా అంటూ తీవ్రంగా మండిపడ్డారు. ప్రత్యామ్నాయం చూపకుండా రోడ్డు పనులు చేపడితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. దీనిపై జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. నిరసనలో గుబ్బల నాగరాజు, నేదూరి శ్రీనివాసరావు, సుంకర నాగభూషణం, గుబ్బల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే ఉజ్వల భవిష్యత్తు



కరస్పాండెంట్ సీహెచ్‌వీ ప్రసాద్, ప్రిన్సిపాల్ బీనాజాన్‌లను సత్కరిస్తున్న ఉపాధ్యాయుల తల్లిదండ్రులు

అయినవిల్లి: విద్యార్థి దశలో క్రమశిక్షణ అలవర్చుకోవడం వల్ల భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని ముక్తేశ్వరం కోనసీమ విద్యాశ్రమ్ పాఠశాల కరస్పాండెంట్ సీహెచ్‌వీవీ ప్రసాద్, ప్రిన్సిపల్ బీనా జాన్ అన్నారు. సోమవారం పదో తరగతి విద్యార్థులకు, విద్యార్థుల తల్లిదండ్రుల సంఘ నాయకులు అధ్యక్షతన వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. వీరు మాట్లాడుతూ విద్యార్థులు చదువులో రాణించడానికి పదోతరగతి కీలకమైందన్నారు. పదిలో మంచి మార్కులు సాధిస్తే ఉన్నతి చదువుల్లో మెరుగైన అభివృద్ధి సాధించవచ్చన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కరస్పాండెంట్ పీహెచ్‌వీ ప్రసాద్, ప్రిన్సిపాల్ బీనాజాన్‌లను దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు భవాని, మణి తదితరులు ఉన్నారు.